నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 21 ఏప్రిల్ 2025 | HYDERABAD

చెత్త అక్రమ డంపింగ్‌కు అడ్డుగోడ

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఫిల్మ్‌నగర్-దర్గా దారిలో రోడ్డు పక్కన గుట్టలు గుట్టలుగా చెత్త వేయడంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నది. అటువైపు నుంచి వెళ్లే వాహనదారులతో పాటు చుట్టుపక్కల ప్రజలు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై 'నమస్తే' 'ముక్కుపుటాలదిరేలా' శీర్షికతో మార్చి 8న ఫొటో వార్త ప్రచురితమైంది. స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ ప్రాంతంలో గోడ నిర్మించి, దానిపై సీసాపెంకులు ఏర్పాటు చేశారు. అక్కడ చెత్త వేస్తే రూ.పదివేలు జరిమానా విధిస్తామని బోర్డు పెట్టారు.

రజతోత్సవ సభ విజయవంతమే లక్ష్యంగా..

మేడ్చల్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమే గులాబీ శ్రేణులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాలు ముగిసిన నేపథ్యంలో ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇందులోభాగంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో ప్రజలను తరలించే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. వాల్ పెయింటింగ్‌లతో పాటు గోడలకు పోస్టర్లు, ఆటోలకు స్టిక్కర్లు, ఇంటింటికీ ఆహ్వాన పత్రికలను అందజేసి బీఆర్ఎస్ రజతోత్సవ సభపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డితో పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు రజతోత్సవ సభ విజయవంతం చేసేలా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు.

ఏ కష్టం వచ్చినా.. అండగా బీఆర్ఎస్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వనం శ్రీరామ్‌రెడ్డికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 20: తెలంగాణ ప్రజలకు రక్షణ కవచమే గులాబీ జెండా అని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అడుగడుగునా ప్రజలను మోసం చేస్తూ కాలం వెల్లదీస్తున్నదని మండిపడ్డారు. 'కాంగ్రెస్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి పైసలు లేవంట.. కానీ మూసీకి మాత్రం లక్ష కోట్లు ఖర్చు చేస్తారంటా.. వీరి అబద్ధపు మాటలు వింటుంటే ప్రజలకే చిరాకు వస్తున్నది' అని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం కేటీఆర్ సమక్షంలో అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వనం శ్రీరామ్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ కార్తీక్‌రెడ్డిలతో కలిసి పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

420 హామీలు ఇచ్చి..

420 హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల ఉంటే ముట్టుకోరని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లు మాత్రం కూల్చుతున్నారన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా మతం పేరుతో ఓట్లు అడగడమే బీజేపీ పనిగా మారిందన్నారు. ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేశ్, పుప్పాల లక్ష్మణ్, అత్తాపూర్‌మాజీ కార్పొరేటర్ విజయ జంగయ్య, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు ఉజ్వల భవిష్యత్

- ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ కోల్పోయింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు

బీఆర్ఎస్‌లో చేరిన సింగారం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి తదితరులు

ఘట్ కేసర్/పోచారం, ఏప్రిల్ 20: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్‌తోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఘట్ కేసర్ పట్టణంలోని ఔటర్ రింగ్ రోడ్ టోల్ ప్లాజా వద్ద పోచారం పట్టణంలోని దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్తుండగా, మంత్రి హరీశ్‌రావుకు ఘట్‌కేసర్ ఉమ్మడి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయిందని విమర్శించారు. వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు తెలంగాణ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే అధికారమన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని మరిచి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, కాచవానిసింగారం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మాజీ సర్పంచ్

కాచవాని సింగారం మాజీ సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అభివృద్ధితోనే ప్రజల్లో గౌరవంగా ఉన్నామని, ప్రజాదరణ కోల్పోయిన పార్టీల్లో ఇమడలేకనే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు.

పురాతన భవనాలపై పట్టింపేదీ?

శిథిల భవనాలపై సమీక్షించని బల్దియా

సిటీబ్యూరో: పురాతన భవనాలపై జీహెచ్‌ఎంసీ మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రతి ఏటా వర్షాకాల ముందుగానే ప్రమాదకర భవనాలపై టౌన్ ప్లానింగ్ సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. శిథిల, ప్రమాదకరమైన భవనాల్లో ఉన్న నివాసితులను గుర్తించి.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయడానికి వారికి ముందుగా కౌన్సిలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఆయా భవనాల చుట్టూ బారికేడ్లను అమర్చాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు శిథిల భవనాలపై గుర్తింపు, గతంలో నోటీసులు ఇచ్చిన భవనాలను పటిష్ఠత, మరమ్మతు పనుల అంశాలపై సమీక్షించిన దాఖలాలు లేవు. కనీసం సర్కిళ్ల వారీగా కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు లెక్క అధికారుల వద్ద లేదు. దీంతో అసలే అకాల వర్షాలు.. ఆపై వచ్చే వర్షాకాలం దృష్ట్యా ప్రమాదకర భవనాల పట్ల స్థానికులు, నివాసితుల ప్రాణాల భద్రత గాలిలో దీపంలా మారింది.

అడవిని చదును చేసి.. మొక్కలు నాటి

వనమహోత్సవం పేరిట హెచ్‌సీయూ భూముల్లో అడవి తొలగింపు



చెట్లు ..పొదలతో మొక్కలు నాటక ముందు..
(ఇన్‌సెట్)లో చదును చేసి వనమహోత్సవం పేరిట నాటిన మొక్కలు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారం ద్వారా ఖాళీ స్థలాలను గుర్తించి కోట్లాది మొక్కలను నాటింది. దీంతో పదేండ్లలో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక హరితహారం పేరును వనమహోత్సవంగా మార్చింది. తాము కూడా మొక్కలు నాటామని చూపుకోవడానికో.. మరే కారణమో తెలియదు కానీ.. ఏకంగా అడవిని చదును చేసి, అక్కడున్న చెట్లు, పొదలు, అరుదైన గడ్డి జాతి మొక్కలను తొలగించి, ఆ ప్రాంతాన్ని చదును చేసి మొక్కలు నాటింది. ఈ ఘనకార్యాన్ని ఏండ్ల తరబడిగా జీవవైవిధ్యానికి కేంద్రమైన హెచ్‌సీయూ భూముల్లో చేపట్టింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 200 ఎకరాలకు పైగా భూముల్లో గతేడాది సెప్టెంబర్, నవంబర్‌లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో అడవిని చదను చేసి మొక్కలను నాటారు. జీవవైవిధ్యం, పర్యావరణానికి కేంద్రమైన అడవిని చదను చేసి మొక్కలు నాటడంపై విద్యార్థులు వ్యతిరేకించారు. ప్రభుత్వం మొక్కలు నాటిన ప్రాంతంలో అరుదైన గడ్డి జాతికి చెందిన మొక్కలున్నాయని, వాటిని తొలగించి ఉపయోగం లేని మొక్కలను నాటారని ఆరోపిస్తున్నారు.

ముందు నుంచే కన్నేశారా?

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే హెచ్‌సీయూ భూములపై కన్నేశారని హెచ్‌సీయూ విద్యార్థులు అంటున్నారు. అడవిని చెరిపేసి మొక్కలు నాటడం అక్కడ అడవి లేదని నిరుపించే పన్నాంగంలో భాగమేనని పర్యావరణ వేత్తలు, హెచ్‌సీయూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మొక్కలు నాటడానికి పచ్చని ప్రాంతాన్ని బుల్డోజర్లతో చదును చేయాల్సిన అవసరం ఏముందని పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు.. ఖాళీ స్థలంలో మొక్కలు నాటేందుకు హెచ్‌సీయూలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని 2024 సెప్టెంబర్ 10న హార్టికల్చర్ విభాగం నుంచి హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌ను కోరారు. కానీ హెచ్‌ఎండీఏ అధికారులు మాత్రం ఖాళీ స్థలాల్లో కాకుండా సౌత్ క్యాంపస్ పరిధిలోని అడవి ప్రాంతంలో పెద్ద పెద్ద చెట్లు, అరుదైన గడ్డి జాతి మొక్కలను తొలగించి వందల ఎకరాలు చదును చేశారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. పార్కులు, షోకేజిల్లో పెంచే మొక్కలను అక్కడ నాటారని విద్యార్థులు చెబుతున్నారు. ఇలా చేయడంతో అక్కడ అడవి లేదు.. వన మహోత్సవంలో తామే మొక్కలు నాటామని చెప్పుకొనేందుకే ఇలా చేశారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అరుదైన మొక్కలు

హెచ్‌సీయూ సౌత్ క్యాంపస్ అడవుల్లో అరుదైన గడ్డి జాతి మొక్కలున్నట్లు ప్లాంట్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు గుర్తించారు. ఇవి జీవవైవిధ్యం పెంపొందడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ గడ్డిజాతి మొక్కల్లో అరుదైన జాతికి చెందిన 'సెరోపీజియా స్పైరాలిస్' మొక్కలు ప్రత్యేకమైనవన్నారు. ఆ ప్రాంతాన్ని చదును చేయడం వల్ల సెరోపీజియా మొక్కల మనుగడ ప్రమాదంలో పడిందన్నారు. వీటితో పాటు ఆ ప్రాంతంలో 273 గడ్డి జాతి మొక్కలు ఉన్నాయని, ఇవి హెచ్‌సీయూలో 'గ్రాస్ లాండ్ ఎకోసిస్టమ్'గా పేరొందినట్లు వివరించారు. ఇప్పటికే పట్టణీకరణ, వ్యవసాయ ఆధునిక పద్ధతుల అనేక గడ్డి జాతి మొక్కలు కనుమరుగవుతున్నాయన్నారు. కానీ హెచ్‌సీయూ లాంటి ప్రాంతాల్లో కూడా ఇలా అరుదైన మొక్కలను అంతం చేయడం పర్యావరణం, జీవావరణం, జీవవైవిధ్యానికి పెద్ద దెబ్బగా మారుతున్నదని విద్యార్థులు, పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

కబ్జా నుంచి కాపాడేందుకు..

రూ.1200 కోట్ల ఖాళీ ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్

బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఏసీబీ కార్యాలయం, ఎమ్మెల్యే కాలనీ మధ్య ఉన్న ప్రభుత్వ స్థలం

బంజారాహిల్స్: కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టారు రెవెన్యూ అధికారులు. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఏసీబీ కార్యాలయం ముందు ఖాళీ స్థలంలో ప్రభుత్వానికి, ప్రైవేటు వ్యక్తులకు మధ్య వివాదాలు ఉండడాన్ని అదునుగా చూసుకుని స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అప్రమత్తమైన షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్థలాన్ని కాపాడేందుకు చర్యలు ప్రారంభించారు. రెవెన్యూ రికార్డులను, కోర్టు కేసులను పరిశీలించగా సుమారు 12 ఎకరాల ప్రభుత్వ స్థలంపై ఎలాంటి వివాదాలు లేవని, కోర్టుల్లో కేసులు కూడా లేవని తేలింది. సుమారు రూ.1200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు ఇటీవల డీజీపీఎస్ సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలానికి హద్దులు నిర్ణయించారు. యుద్ధ ప్రాతిపదికన స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఏసీబీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న ఈ స్థలం హకీంపేట విలేజ్ పరిధిలోని సర్వే నంబర్ 102/1లో టీఎస్ 1/పీ, 3/పీ,బ్లాక్-జే, వార్డు 12 కిందకు వస్తుంది.12 ఎకరాల ప్రభుత్వ స్థలంతో పాటు దీన్ని ఆనుకుని సర్వే నంబర్ 102/2, 102/3లో సుమారు 16 ఎకరాల ప్రైవేటు స్థలం ఉంది. ఈ ప్రైవేటు స్థలంపై అనేక మంది వ్యక్తులు, సొసైటీల మధ్య వివాదాలు వివిధ న్యాయస్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల ల్యాండ్ బ్యాంక్‌లో ఉన్న స్థలాలను ఆక్రమణలు కాకుండా చూసేందుకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించిన షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఏసీబీ ఎదురుగా ఉన్న 12 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించగా, ఈ 12 ఎకరాల ప్రభుత్వ స్థలంపై ఎలాంటి వివాదాలు లేవని, సర్వే చేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకుని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే పకడ్బందీగా సర్వే చేసి ఫెన్సింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇటీవల డీజీపీఎస్ సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు. వారంరోజులుగా స్థలం చుట్టూ ఫెన్సింగ్ పనులు నిర్వహిస్తున్నారు.

తాను విషం తాగి.. కూతురికి తాగించి..

కుమార్తె మృతి..చికిత్స పొందుతున్న తల్లి

చిన్నారి జశ్విత (ఫైల్)

దుండిగల్: ఓ వైపు అనారోగ్యం..మరోవైపు కుటుంబకలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. తాను విషం తాగడంతో పాటు కూతురికి తాగించింది. చికిత్స పొందుతూ కూతురు చనిపోగా, తల్లి చికిత్స పొందుతున్నది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని బాపట్లకు చెందిన నంబూరి సాంబశివ రావు, కృష్ణ పావని (32) దంపతులు నాలుగేండ్ల కూతురు జశ్వితతో కలిసి బాచుపల్లి, ఆదిత్య గార్డెన్ కాలనీలో ఉంటున్నారు. సాంబశివరావు నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కృష్ణ పావని కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ విషయంలో అప్పుడప్పుడు దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 18న భర్త ఇంట్లో లేని సమయంలో పావని కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని తాను తాగడంతో పాటు కూతురుకి తాగించింది. ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సాంబశివ రావు ఇద్దరిని వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ జశ్విక చనిపోయింది. కృష్ణ పావని చికిత్స పొందుతున్నది.

ఎర్లీబర్డ్.. వసూలైంది రూ.354 కోట్లే

సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.1000కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యాన్ని ఖరారు చేసిన కమిషనర్ ఇలంబర్తి..టార్గెట్ ఛేదించేందుకు స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేశారు. అయితే ఆదివారం వరకు 4.25 లక్షల మంది ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోగా...తద్వారా రూ. 354.09 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. మరో పది రోజుల్లో ఎర్లీబర్డ్ స్కీం ముగుస్తుండగా, రూ.646 కోట్ల మేర రావాల్సి ఉంది.

క్రికెట్ ఆడుతూ..ఆగిన గుండె

కీసర, ఏప్రిల్ 20; క్రికెట్ ఆడుతూ ఓ యువకుడు గుండెపోటుతో చనిపోయాడు. కీసర సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. నగరంలోని బోయినపల్లికి ప్రణీత్ (32) తన తోటి స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం రాంపల్లిదాయరలోని మైదానానికి వచ్చారు. క్రికెట్ ఆడుతుండగా ప్రణీత్‌కు అకస్మాత్తుగా శ్వాస ఆడకుండా పోయింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా నేలకొరిగి అపస్మారక స్థితిలోకి చేరాడు. వెంటనే 108లో దవాఖానకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రణీత్ చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా దూసుకొచ్చి.. స్తంభాన్ని ఢీకొట్టి..

కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు దుర్మరణం

దుండిగల్, ఏప్రిల్ 20: ఔటర్‌పై ఆదివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన కారు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఒడిశా రాష్ట్రం జైపూర్ కు చెందిన గిర్ధుడు భాను ప్రకాశ్(36), అదే రాష్ట్రం రౌర్కెల కు చెందిన నళిని(37) స్నేహితులు. నగరంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు చేస్తూ మంచిరేవులలో ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున కారులో మేడ్చల్ నుంచి పటాన్‌చెరూ వైపు వెళ్తున్నారు. వేగంగా ప్రయాణిస్తుండడంతో మల్లంపేట ఓఆర్ఆర్ వద్ద వీరి కారు అదుపు తప్పింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. భాను ప్రకాశ్, నళిని అక్కడికక్కడే చనిపోయారు. మితిమీరిన వేగం,అజాగ్రత్తగా వాహనం నడపడం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌లో పటాకులెక్కడివి..?

- అగ్ని ప్రమాదంతో బయటపడ్డ భద్రతా వైఫల్యం
- పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు
- ఆరోగ్యశ్రీ గదిలో ప్రత్యక్షమైన పటాకులు..
- 24 గంటల్లో మాయం

ఖైరతాబాద్: వేలాది మంది రోగులు, వందలాది మంది వైద్య సిబ్బంది....24/7 సెక్యూరిటీ గార్డుల పహారా...అన్నింటినీ దాటుకుంటూ.. అగ్ని ప్రమాదకారకాలైన పటాకులు నిమ్స్ ఆస్పత్రికి చేరాయి. ఎమర్జెన్సీ వార్డులోని ఆడిటోరియంకు ఆనుకొని ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో స్టాకుగా ఉన్నాయి. శనివారం ఆడిటోరియంలో జరిగిన అగ్ని ప్రమాదంతో ఈ భద్రతా వైఫల్యం బయటపడింది. ఈఎండీ వార్డులోనే పల్మనాలజీ, వాస్కులర్, న్యూరో సర్జరీ, ఐసీయూ తదితర విభాగాలు ఉన్నాయి. మంటలు వ్యాపించి పటాకుల స్టాకుగా ఉన్న గది వరకు చేరి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం 3,500 మంది రోగులు వివిధ చికిత్సల కోసం నిమ్స్ ఆస్పత్రికి వస్తుంటారు. డైరెక్టర్‌తో సహా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులైన వైద్యులు నిత్యం రోగులకు వైద్య సేవలందించడంలోనే తలమునకలవుతారు. ఈ నేపథ్యంలో అందరి భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ పటాకులు దర్శనమిచ్చాయి. అగ్ని ప్రమాదం జరిగిన క్రమంలో స్వయంగా నిమ్స్ వైద్యాధికారి పటాకుల విషయంలో విచారణ చేయాలని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు ప్రారంభించారు.

నిన్న దర్శనం.. నేడు మాయం

నిమ్స్ ఎమర్జెన్సీ వార్డులోని ఐదో అంతస్తులోని ఆడిటోరియంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్ ఎస్టింగ్యూషర్లతో మంటలను ఆర్పివేశారు. అదే క్రమంలో దానికి ఆనుకొని ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులు బయటపడ్డాయి. సిబ్బంది..పటాకులు ఎవరు తెచ్చారని ఆరా తీస్తే..అందరి నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది. పటాకుల విషయంపై నిమ్స్ వైద్యాధికారి ఒకరు పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తులో భాగంగా పోలీసుల బృందం నిమ్స్‌లోని సదరు కార్యాలయానికి వచ్చి పరిశీలించగా, అవి మాయమయ్యాయి. అసలు తెచ్చిందే వరూ....మాయం చేసిందెవరూ....దీని వెనుక ఉన్నదెవరూ....24 గంటల్లో ఎలా మాయమయ్యాయి....తెచ్చిన వారే మాయం చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. కాగా, నిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్, ఆరోగ్యశ్రీ సీఈవో ఆర్వీ కర్ణన్ ఆదివారం ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

కొంపముంచిన సిగరెట్

సిటీబ్యూరో/ఖైరతాబాద్:నిమ్స్ ఆసుపత్రి అత్యవసర వైద్య విభాగంలో అగ్ని ప్రమాద ఘటనకు కాల్చి సగంలో పారేసిన సిగరెట్టె కారణమని పోలీసులు నిర్ధారించారు. ఘటనాస్థలంలో విచారణ జరుపుతున్న సందర్భంలో సిగరెట్ ప్యాకెట్లు, కాల్చిపడేసిన సిగరెట్ ముక్కలు, బీడీలు, చెత్త కనిపించాయి. ఈ నేపథ్యంలో సిగరెట్, చెత్తతోనే అగ్నిప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు. నిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై విచారణ కొనసాగుతుండగా, పలు కీలక విషయాలు బయటపడ్డాయి. ఘటనకు లిఫ్ట్ పక్కననున్న చెత్తలో తాగి పారేసిన బీడీలు, సిగరెట్ కారణమని పోలీసుల తేల్చారు. ఖాళీగా ఉన్న స్థలంలో కొంతమంది సిబ్బంది చెత్తను వేయడంతో పాటు సిగరెట్ తాగి అక్కడ పడేశారు. అక్కడ ఉన్న బీడీ ముక్కలు, సిగరెట్లలో నుంచి నిప్పు పడడంతో చెత్త అంటుకుని మంటలు చెలరేగాయి. అది పైనున్న విద్యుత్ వైర్లకు అంటుకుని మంటలు వ్యాపించినట్లు పోలీసులు ధ్రువీకరించారు.